సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

- ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


బుసిరెడ్డిపల్లిలో సీఎంఆర్‌ఎస్ చెక్కును అందజేస్తున్న కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని, ప్రభుత్వం అందించే ఈ సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన చిన్నమ్మకు రూ. 2లక్షల చెక్కు, చింతకుంట గ్రామానికి చెందిన రోషయ్యకు రూ.2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ఆపద్బాంధవుడిగా ఆదుకుంటుందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం సహాయనిధితో పేదలు కార్పొరేటు స్థాయి ఆస్పత్రులల్లో వైద్యం చేయించుకుంటున్నారన్నారు. మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అందజేయడంపై బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్ మరణం పార్టీకి తీరని లోటు

మండలంలోని రాయినిపల్లి సర్పంచ్ సుఖేందర్‌నాయుడు అకాల మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్పంచ్ మరణ వార్త తెలియగానే శనివారం గ్రామానికి చేరుకొని సర్పంచ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామాభివృద్ధి కోసం ఎప్పుడు కృషి చేసేవాడని, మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, దేవేందర్‌నాయుడు, రాంమూర్తినాయుడు, రఘుపతినాయుడు, దశరథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని కోతులకుంట తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని శనివారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలో తాగునీటి సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు. తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి తగుచర్యలు తీసుకోవాలని కోరగా ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు అంజి నాయక్, మండల కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందిన అగ్గన్నగారి రవీందర్‌రెడ్డి, సుజాత దంపతుల కుమారుడు యశ్వంత్‌రెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేసి నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో 1,071 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకట్రామమ్మ చిన్నారెడ్డి విద్యార్థి యశ్వంత్‌రెడ్డితో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మధుయాదవ్ ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం


చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేమద్దులలో చలో ఢిల్లీ కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8 ఏళ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలపై ప్రజలు, కార్మికులను చైతన్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన వ్యవసాయ చట్టాలతో విద్యుత్ సంస్కరణ బిల్లుతో వ్యవసాయాన్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకాలకు బడ్జెట్‌లో తక్కువ నిధులను కేటాయించిందని మండిపడ్డారు. కూలీలకు పని దినాలను పెంచి రోజువారీ కూలీ రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరలను నియంత్రించకుండా రోజురోజుకు పేదలపై పెను భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. కార్మికులు, కర్షకులు, కష్టజీవుల డిమాండ్ల సాధనకై తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, రైతు సంఘం నాయకులు భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాసులు, నిరంజన్, మల్లేష్, రాముడు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పెబ్బేరు: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన పట్టణ మహిళలు మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సావ్ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాన్ కృపాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, మధ్య తరహా, ఎన్‌జీఓలతో పాటు పబ్లిక్ టాయిలెట్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్, తడి పొడి చెత్త సేకరణ, డీఆర్‌సీసీ నిర్వహణ వంటి అంశాలలో మహిళలు ఈ నెల 22 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్. 08545 296530, 99632 20560 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌తో 9 కేసుల పరిష్కారం


లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి శిరీష

ఆత్మకూర్: దీర్ఘకాలికంగా బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించలేని వారికి లోక్ అదాలత్‌తో బ్యాంకు వారు ఏర్పాటు చేసిన బ్యాంక్ అదాలత్‌లో రుణ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆత్మకూర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్ శిరీష అన్నారు. ఆత్మకూర్ సివిల్ కోర్టులో శనివారం అమరచింత యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాంక్ అదాలత్‌లో పాల్గొని రుణగ్రస్తుల ద్వారా నగదును రికవరీ చేశారు. తొమ్మిదేళ్ల కిందట రుణాలు పొందిన తొమ్మిది మంది ఇప్పటికీ రుణాలు చెల్లించలేదు. వీరికోసం లోక్ అదాలత్ నిర్వహించగా 13 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీరి నుంచి మొత్తంగా రూ.2.3లక్షలు వసూలు అయ్యాయని బ్యాంక్ మేనేజర్ సాయిచంద్ తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు తిప్పారెడ్డి, జీకే రాములు, న్యాయవాదులు ముక్తేశ్వర్, సుదర్శన్‌గౌడ్, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

అమరచింత: కొన్ని ఏళ్లుగా మూత్రపిండ సంబంధిత సమస్యతో బాధపడుతున్న సింగంపేట మాజీ సర్పంచ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కురుమన్న శనివారం మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా ఉంటూ మండలంలో పార్టీ ఎదుగుదలకు తన వంతు కృషి చేశాడని కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. కురుమన్న మృతి పార్టీకి తీరని లోటని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ తెలిపారు.

సంతకు శాశ్వత స్థలం లభించేనా?


ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న కొత్తకోట సంత (ఫైల్)

- ప్రభుత్వ స్థలం ఉన్నా.. ప్రైవేట్ స్థలంలో నిర్వహణ
- ఆరుబయట విక్రయాలు
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు

కొత్తకోట: పట్టణంలో ప్రతి గురువారం పెద్ద ఎత్తున సంత జరుగుతోంది. కర్నూల్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఓపెన్ స్థలంలో నిర్వహిస్తున్న సంతలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. స్థానిక ఉషోదయ పాఠశాల సమీపంలో నాలుగేళ్ల క్రితం సంత కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. అక్కడ నీళ్ల సదుపాయం కోసం మినీ వాటర్ ట్యాంకులు నిర్మించారు. కానీ నేటికీ సంతను ప్రభుత్వ స్థలంలోకి మార్చకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్ద ఎత్తున సంత జరుగుతున్నప్పటికీ ప్రైవేటు స్థలం కావడం వల్ల మౌలిక వసతులు, తాగునీటి సమస్యను అధికారులు తీర్చలేకపోతున్నారు. ప్రజలు వారం రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేయడానికి చుట్టు పక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.

తాగునీటికి ఇబ్బందే..

ఎంతో దూరం నుంచి వచ్చే వినియోగదారుల కోసం సంతలో తాగునీరు లేని పరిస్థితి నెలకొంది. గతంలో కొంత కాలం మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం తాగునీటిని సరఫరా చేయకపోవడంతో వ్యాపారస్తులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో వ్యాపారం నిర్వహించే కొందరు మాత్రం ఇంటి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లలో నీళ్లను తెచ్చుకుంటున్నారు. వ్యాపారులకు షెడ్లు నిర్మించకపోవడంతో ఆరుబయటే కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షం వస్తే ఆ రోజు వ్యాపారులు, కొనుగోలుదారులు పరుగులు పెట్టాల్సిందే. ప్రతి గురువారం సంతకు సుమారు 3 వేల నుంచి 5 వేల వరకు కొనుగోలు దారులు వస్తుంటారు.

తైబజార్ వసూల్ చేసినా..

తైబజార్ వేలాన్ని ఏటా పది శాతం పెంచుతూ మున్సిపాలిటీకి రూ.లక్షల ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. తైబజార్ నుంచి ఏటా రూ. 20 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు, కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. పాలకులు స్పందించి ప్రభుత్వ స్థలంలోకి సంతను మార్చి షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్ల సమస్య, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో కొనసాగించాలి



కొత్తకోటలో ప్రతి గురువారం సంత జరుగుతోంది. వేల సంఖ్యలో వ్యాపారులు వస్తుంటారు. పట్టణంలో బైపాస్ వద్ద సంత కోసం స్థలం కేటాయించారు. కానీ ఇప్పటికీ ఆ స్థలాన్ని సంతకు ఉపయోగించడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న సంత స్థలంలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – నిక్సన్, కొత్తకోట

అధికారులు స్పందించాలి



సంతకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలోకి మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు స్థలంలో సంత నిర్వహించడం వల్ల వ్యాపారులు, వినియోగదారులు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వ్యాపారస్తులకు అవస్థలు తప్పట్లేదు. శాశ్వత సంత స్థలంలో షెడ్లు ఏర్పాటు చేయాలి. – సత్యం, కొత్తకోట

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం


విద్యార్థుల ప్రతిభాపాటవాలు వివరిస్తున్న ఉపాధ్యాయులు

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం ఉందని డీఎంఆర్‌ఎం పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు అన్నారు. డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలను గౌరవించడం, తోటి వారితో మర్యాదగా నడుచుకోవడం అనే అంశాలను ఉపాధ్యాయులు చదువుతో పాటు విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల హాజరు, ప్రతిభాపాటవాలు ఎప్పటికప్పుడు గుర్తించి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, నిత్యం భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించాలని తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలస్వామి. సీఆర్పీ స్వామి, ఉపాధ్యాయులు బీటీ కిరణ్, పద్మ, అంజుం షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


కంభాళాపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ

పెబ్బేర్ రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్, ఎంఈఓ జయరాములు అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండలంలోని కంభళాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను వారు పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా బోధన సాగుతుందని, దీంతో పాటు ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పుస్తకాలు, దుస్తులు, మ ధ్యాహ్న భోజనం తదితర వాటిని సద్వినియోగం చేసుకునేలా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు ఇచ్చే సూచనలు, సలహాలను తప్పక పాటిస్తామన్నారు. దీంతో పాటు వెంకటాపూర్, గుమ్మడం ప్రాథమిక పాఠశాలలు, సూగూర్ ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు.

'గిరిజన బంధు' అమలు చేయాలి


మాట్లాడుతున్న రోజారమణి

పాన్‌గల్: దళితబంధు మాదిరిగానే గిరిజనులకు గిరిజన బంధు అమలు చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రోజారమణి అన్నారు. మహిళలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గిరిజన మహిళలతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను మహిళలకు వివరించారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు ఆధ్వర్యంలో మహిళల కోసం కుట్టు పరిశ్రమ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఎంతో మంది మహిళలు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మహిళలకు రాజకీయపరంగా బీజేపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆమె మహిళలను కోరారు. కార్యక్రమంలో పద్మ, కల్పనరెడ్డి, జ్యోతి, అఖిల, పల్లవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కలిసి శ్రమిద్దాం.. ఇందిరమ్మ రాజ్యాన్ని తెద్దాం


మండల కాంగ్రెస్ కమిటీ నాయకులతో నాగరాజుగౌడ్

అమరచింత: ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ తీసుకొచ్చి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై ప్రజలతో కలిసి ఆందోళన చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుడి పోరాడాలన్నారు. కార్యక్రమంలో నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కేజీ మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్ గౌడ్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కురుమన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ప్రకాశం, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్‌రెడ్డిని ఎన్నుకోన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, శ్యామ్, పోషిరిగారి విష్ణు, నాగునాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

వనపర్తిటౌన్: ఆర్టీసీ సేవలను విస్తరించి బలోపేతం చేసేందుకు ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో కమిటీ గౌరవ అధ్యక్షుడు పుట్టా ఆంజనేయులు, అధ్యక్షుడు జీవీ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ


వినికిడి యంత్రాలు అందుకున్న వారితో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని ఆరోగ్య మాత రూరల్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 43 మంది పిల్లలకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. నిర్మలదాసి సేవాసంస్థ, చాయ్–వీ గార్డ్ సహకారంతో యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీఎం హెచ్‌ఓ సుధాకర్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్నవారు చిన్న వయస్సు నుంచే తగిన చికిత్సలు తీసుకుంటే వినికిడి సమస్యలు తొలిగిపోయే అవకాశాలు ఉంటాయన్నారు. వినికిడి యంత్రాలు అందించిన సేవాసంస్థలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ శోభారాణి, ఆరోగ్యమాత కేంద్రం సిస్టర్లు లూసీ, నెల్లిస్సెరీ, రోసిలి, శాంటి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ పార్కు పరిశీలన



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ పార్క్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహ్లాదకరంగా అన్ని హంగులతో పార్క్, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి కావడంతో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, ఏఈ రమేష్‌నాయుడు, నాయకులు సాయినాథ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాములు పట్టే పరికరం అందజేత



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామ యువకులకు పాములు పట్టే పరికరాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములు కనిపిస్తే చంపకుండా యువకులకు సమాచారం ఇస్తే వారు పట్టి అడవుల్లో వదులుతారన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌కు చెందిన దండు శాంతమ్మ(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. గ్రామస్తులు, టీఎమ్మార్ యువజన సంఘం నాయకులు నరేష్ బాధిత కుటుంబ పరిస్థితిని ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎంపీపీ తక్షణ సహాయంగా రూ.5వేలు పంపించాడు. ఆ నగదును టీఎమ్మార్ సభ్యులు మృతురాలి భర్త వెంకటయ్యకు అందజేశారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చిన నేనున్నాంటూ సహాయం చేసేందుకు ముందుకు వస్తున్న ఎంపీపీ మేఘారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం

గోపాల్‌పేట: స్థానిక పీఎస్‌లో యువతి అదృశ్యమైన కేసు నమోదు అయిందని ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తాడిపర్తికి చెందిన వెంకటయ్య, భాగ్యమ్మ కుమార్తె లక్ష్మి అదే గ్రామంలో కుట్టుమిషన్ పని చేస్తుంటుంది. శుక్రవారం కుట్టుమిషన్ కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లితండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏదుట్ల రోడ్డులో ప్రమాదం : ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట: ఏదుట్ల రోడ్డులో బైకు అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోపాలపేట వైపు నుంచి శివ శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో బైక్‌పై ఏదుట్ల వైపు వెళ్తున్నాడు. శుక్రవారం వచ్చిన ఈదురు గాలుల కారణంగా కరెంటు సరఫరా నిలిచిపోవడంతో రోడ్డు సరిగా కనిపించక నడుచుకుంటూ వెళ్తున్న బద్రును ఢీకొట్టి కిందపడ్డాడు. దీంతో బద్రు తలకు బలమైన గాయం కావడంతో పాటు కాళ్లకు దెబ్బలు తగిలాయి. అలాగే బైకు నడుపుతున్న శివ చేతి, భుజానికి బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు ఇద్దరినీ ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గడువు పొడిగింపు

వనపర్తి: సాంఘిక సంక్షేమ గురుకులంలో అయిదో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును 20వ తేదీ వరకు పొడిగించినట్లు పెద్దమందడి గురుకులం ప్రిన్సిపాల్ కె.రాజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 చివరి తేదీ ఉండగా.. ప్రభుత్వం మరో నాలుగు రోజులు పెంచినట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పెద్దదర్గా ఉర్సు వాయిదా

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో కృష్ణానదిలో ఆరు నెలలు, కృష్ణాతీరాన ఆరు నెలలు ఉంటున్న ఆదిహజరత్ సయ్యద్‌ఖాద్రి పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 19న జరగాల్సింది. అయితే ఈ ఉత్సవాల సమయంలో వర్షం పడడంతో ఎక్కువగా బురదమయం కావడంతో వచ్చేనెల 30న నిర్వహించేందుకు సర్పంచ్ ఎస్‌కె ఖాజా, దర్గా కమిటీ సభ్యులు శనివారం నిర్ణయించారు.